1

నవతెలంగాణ

నమ్మకమైన తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

బుధవారం | డిసెంబర్ 27, 2023 | www.navatelangana.com

ప్లీనరీకి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన పార్టీ ప్లీనరీకి సహకరించిన వారందరికీ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్టీ ప్లీనరీకి వివిధ వర్గాల ప్రజలు సహకరించారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీగా అనేక పోరాటాలు చేశామని, బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రైతులకు న్యాయం చేయలేదని తెలిపారు. అంతే కాకుండా జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో నేటికీ వైద్యం, రోడ్డు సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాల కోసం నూతన ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నూతన ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. భవిషత్తులో ప్రజల పక్షాన పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్, రాజేందర్ పాల్గొన్నారు.

చెరువు శిఖం ఆక్రమణను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం భూర్గుపల్లి శివారు కిష్టయ్య(కుంట) చెరువు శిఖం భూమి ఆక్రమణకు గురవుతున్నట్లు తెలుసుకొని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. పట్టాదారులుగా చెప్పుకుంటున్న కొందరు మంగళవారం ట్రాక్టర్లతో చదును చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు అధికారులు అక్కడికి చేరుకున్నారు. చెరువు శిఖంలో ఇమిడి ఉన్న పట్టా భూమిని గుర్తించడానికి సర్వే చేయాల్సి ఉండగా అక్రమంగా చదును చేయడం సరికాదని రెవెన్యూ అధికారులు చెప్పారు. పూర్తి స్థాయిలో సర్వే చేసేంత వరకు శిఖంలో ఎలాంటి భూ అభివృద్ధి పనులు చేయరాదని హెచ్చరించినట్లు తహసీల్దార్ విశ్వంబర్ తెలిపారు.



ప్రజాపాలన కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలి



ఆదిలాబాద్‌టౌన్: ప్రజాపాలన కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్త అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన కార్యక్రమంపై గ్రామ, వార్డు సభల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు చేరువగా పాలన అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు పని దినాలలో ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ వార్డులలో సభలు నిర్వహించి ప్రజల నుంచి ప్రభుత్వం అమలు చేయనున్న అరు గ్యారంటీలపై దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ప్రతి మండలం పరిధిలో తహసీల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి బృందం రోజుకు రెండు గ్రామాల చొప్పున పర్యటించి, ఉదయం 8 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు షెడ్యూలలో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారని తెలిపారు. మహాలక్ష్మి, రైతుభరోసా, చేయూత, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల మొదలగు పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ప్రతి గ్రామంలో ఒక రోజు ముందుగానే ప్రచారం నిర్వహించి, ప్రజలందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామసభలో టెంట్, తాగునీరు ఇతర వసతులు కల్పించాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జత చేసేలా దరఖాస్తుదారులకు సూచించాలన్నారు. ప్రజాపాలన సభ నిర్వహణకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని, కార్యక్రమంలో వారిని భాగస్వామ్యం చేయాలని తెలిపారు. కౌంటర్ల వద్ద క్యూలైన్ విధానం పాటించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మేర పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. మండల స్థాయి సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రజాపాలన నిర్వహణ పట్ల అవగాహన కల్పించాలని, అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జెడ్పీ సీఈఓ గణపతి, డీపీఓ శ్రీనివాస్, ఆర్డీఓ స్రవంతి, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తారుమారు..!

- పార్టీలకు తీపి..చేదు కలయికను మిగిల్చిన అసెంబ్లీ ఎన్నికలు
- కాంగ్రెస్, బీజేపీలదే పైచేయి
- బీఆర్ఎస్‌కు నష్టం
- కొత్త ప్రభుత్వం ఏర్పాటు, నూతన పథకాలు ప్రారంభం
- ఈ ఏడాది ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో అనేక మార్పులు



ఉమ్మడి జిల్లా రాజకీయ పరిస్థితులు తారుమారయ్యాయి. ఈ ఏడాదిలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. 2023 ఏడాది కొన్ని పార్టీలకు తీపి గుర్తులను తీసుకురాగా.. మరికొన్నింటికి చేదు అనుభవాలను మిగిల్చింది. అసెంబ్లీ ఎన్నికలు జరగడం.. కొందరు విజయం సాధించగా..మరికొందరు ఓటమి చెందడంతో ఈ ఏడాది అందరికీ గుర్తుండిపోతుంది. పదేండ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏకఛత్రాధిపత్యంతో ఏలిన గులాబీ పార్టీ ఇటీవల జరిగిన ఎన్నికల్లో చతికిలపడింది. పది అసెంబ్లీ స్థానాలకు కేవలం రెండింటికే పరిమితం కాగా ఇది వరకు ఒక్కసీటు కూడా లేని కాంగ్రెస్, బీజేపీ ఏకంగా చెరో నాలుగు స్థానాలను గెలుచుకొని ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. ఇది వరకు ఉన్న ప్రజాప్రతినిధులు మారిపోవడం..కొత్త వారు ఎన్నికకావడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇదే ఏడాదిలో నూతన ప్రభుత్వం కొలువు దీరడం..కొత్త పథకాలు ప్రారంభం కావడం ప్రత్యేకతను సంతరించుకుంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఈ ఏడాది రాజకీయాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు రావడం..పాత ప్రభుత్వం మారిపోవడం.. కొత్త సర్కారు కొలువుదీరడం వంటి పరిణామాలు ఈ ఏడాది ప్రత్యేకతగా చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఉండగా 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తొమ్మిది స్థానాలు కైవసం చేసుకుంది. ఆసిఫాబాద్‌లో మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. అనంతరం కొద్ది కాలానికే కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన ఆత్రం సక్కు గులాబీ గూటికి చేరిపోవడంతో పది స్థానాల్లోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహించారు. స్థానిక సంస్థల్లోనూ ఈ పార్టీదే ఆధిపత్యం కనిపించింది. కానీ ఐదేండ్లు తిరిగే సరికి పరిస్థితులు తారుమారయ్యాయి. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) చతికిలపడింది. పది స్థానాల్లో ఎనిమిదింటిని కోల్పోయింది. కేవలం ఆసిఫాబాద్, బోథ్‌లో మాత్రమే విజయం సాధించింది. రాష్ట్రంలో మూడోసారి అధికారానికి దూరమైంది. ఘోర ఫలితాలు చవిచూడటంతో బీఆర్ఎస్ శ్రేణుల్లోనూ నైరాశ్యం అలుముకుంది. 2023 ఏడాది గులాబీ పార్టీకి చేదు గుర్తులను మిగిల్చింది.

కాంగ్రెస్‌కు అధికారం..బీజేపీకి సీట్లు..!

కిందటేడాది 2022 వరకు ఉమ్మడి జిల్లాలో అంతగా ప్రభావం లేని కాంగ్రెస్ పార్టీ..2023లో అనూహ్యంగా పుంజుకుంది. రాష్ట్రంలో ఆ పార్టీ గాలివీయడం.. బీఆర్ఎస్‌ను మార్చాలనే ప్రజల నిర్ణయం కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చింది. తూర్పు జిల్లాలో మూడు స్థానాలు, పశ్చిమ జిల్లాలో ఒక స్థానంతో నాలుగింటిని గెలుచుకుంది. మిగితా ఆరింటిలో మాత్రం నిరాశజన ఫలితాలను చవిచూసింది. ఉమ్మడి జిల్లాలో ఎక్కువ సీట్లు గెలువకపోయినా.. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరపడుతున్నాయి. ఈ ఏడాది కాంగ్రెస్ శ్రేణులకు తీపి గుర్తులను తీసుకొచ్చిందని చెప్పవచ్చు. మరోపక్క ఉమ్మడి జిల్లా చరిత్రలో 2018 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సారి కూడా ఖాతా తెరవని బీజేపీ 2023కి వచ్చే సరికి ఏకంగా నాలుగు స్థానాలు కైవసం చేసుకుంది. 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం ఎంపీ స్థానాన్ని గెలుచుకుంది. తాజాగా 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ జిల్లాలో మూడు స్థానాలు, తూర్పు జిల్లాలో ఒక స్థానంలో విజయం సాధించింది. 2023 ఏడాది ఉమ్మడి జిల్లా చరిత్రలో బీజేపీ తొలిసారి అసెంబ్లీ స్థానాల్లో పాగా వేయడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరపడుతున్నాయి. మరోపక్క ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాకు జాతీయ, రాష్ట్ర స్థాయి అగ్రనేతలు రావడం ప్రాధాన్యాంశంగా మారింది. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీతో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వంటి అగ్రనేతలు పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

కొత్త పథకాలు ప్రారంభం..!

ఇదే ఏడాదిలో ఎన్నికలు జరగడం.. కొత్త ప్రభుత్వం కొలువుదీరడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీల అమలు దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే మహాలక్ష్మీ పథకంలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం.. చేయూతలో భాగంగా ఆరోగ్యశ్రీ సేవలను రూ.10లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ పథకాలు ఇప్పటికే అమలు కావడం ఈ ఏడాది ప్రత్యేకతను సంతరించుకుంది. మరోపక్క ఈ నెల 28వ తేదీ నుంచి ప్రజా పాలన పేరిట సభలు నిర్వహించి మిగితా పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించే ఏర్పాట్లు చేస్తోంది. మొత్తానికి 2023 ఏడాది రాజకీయ పార్టీలకు తీపి, చేదు అనుభవాలను మిగిల్చిందని చెప్పొచ్చు.







అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్న రేవంత్‌రెడ్డి, ప్రధాని నరేంద్ర మోదీ, బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర్‌రావు(ఫైల్)

సింగరేణి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి



నస్పూర్ : తెలంగాణకే తలమానికమైన సింగరేణిలో ఈ నెల 27న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా ప్రాంతంలో జరగనున్న ఎన్నికల ఏర్పాట్లను డీసీపీ సుధీర్ రామ్నాథ్ కేకన్, చెన్నూర్ ఎసీపీ మోహన్, ఆర్‌డీఓ రాములు, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, డీజీఎం అరవిందరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని బెల్లంపల్లి డివిజన్‌లో 3 సింగరేణి ప్రాంతాలు ఉన్నాయని, పోలింగ్ నిర్వహణ కొరకు 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 5 రూట్లుగా విభజన చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సిబ్బందికి తగు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నేడే సింగరేణి సమరం..!

- గుర్తింపు సంఘం ఎన్నికలకు సర్వం సిద్ధం
- 11 డివిజన్‌లలో 84 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- ఇదే రోజు రాత్రి వరకు ఫలితాలు వెల్లడికి అవకాశం
- ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ప్రధాన సంఘాలు

నవతెలంగాణ- నస్పూర్

నల్లబంగారు నేలగా పిలిచే సింగరేణి ఎన్నికల రణ క్షేత్రానికి సమయం ఆసన్నమైంది. గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. బుధవారం ఉదయం నుంచి 7గంటల నుంచి సాయంత్రం 5గంటల పోలింగ్ నిర్వహిస్తారు.అనంతరం లెక్కింపు ప్రారంభం కానుంది. ఇదే రోజు రాత్రి వరకు ఫలితాలు వెల్లడించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. రెండేండ్లకు ఒకసారి జరగాల్సిన గుర్తింపు సంఘం ఎన్నికలు పలు కారణాలతో వాయిదాపడుతూ వచ్చాయి. తాజాగా అడ్డంకులు తొలగిపోవడంతో కేంద్ర కార్మికశాఖ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసింది.

39,773మంది ఓటర్లు..!

సింగరేణి పరిధిలోని 11 డివిజన్లలో 84 పోలింగ్ కేంద్రాలు ఉండగా అత్యధికంగా శ్రీరాంపూర్ డివిజన్లో 15 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఉదయం 7 గంటలకు మొదలై సాయంత్రం 5 గంటల వరకు ముగుస్తుంది. ఈ రోజు సాయంత్రమే ఎన్నికల ఫలితాలు కూడా వెల్లడికానున్నాయి. మొత్తం 11 డివిజన్లలో 39,773 మంది కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో అధికంగా 9124 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఏడో దఫా జరుగుతున్న గుర్తింపు ఎన్నికల ప్రక్రియలో మొత్తం 13 యూనియన్లు పోటీ పడుతున్నాయి. ఈ ఎన్నికలు సాధారణ ఎన్నికల పద్ధతిలోనే నిర్వహించనున్నాయి. పోలింగ్, పోలీస్, కౌంటింగ్ సిబ్బందిని ఆరు జిల్లాల కలెక్టర్లు ప్రతిపాదించిన రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖలు నియమించడం జరిగింది.



కార్మికులు ఎవరి వైపు..!

సింగరేణి గుర్తింపు ఎన్నికలు నేడు జరగనుండగా 11 డివిజన్ల కార్మికులు పోటీలో ఉన్న 13 యూనియన్లలో ఎవరు వైపు మొగ్గుచూపుతారని ఆసక్తి నెలకొంది. గతంలో గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ ప్రస్తుతం బలహీన పడింది అనడంలో సందేహం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘమైన ఐఎన్‌టియుసీ సింగరేణి ప్రాంతంలో గెలుపొందిన ముగ్గురు ఎమ్మెల్యేలతో జోరుగా ప్రచారం సాగించారు. విజయం కోసం ఐఎన్‌టీయూసీ ముమ్మర ప్రయత్నాలు చేయగా.. ఎన్నికలు నిర్వహించాలని కోర్టు మెట్లు ఎక్కి మరి కొట్లాడిన ఏఐటీయూసీ సైతం గెలుపు బాటలో ఉన్నామంటూ జోరుగా ప్రచారం నిర్వహించారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో అనుబంధ సంఘమైన టీబీజీకేఎస్‌ను కార్మికులు రెండు సార్లు గెలిపించగా.. ఈ సారి బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్రకు పరిమితమైంది. అధికారంలో ఉన్నా లేకున్నా కార్మికుల సంక్షేమం కోసం, కార్మికుల పక్షాన నిలబడే సీఐటీయూ కూడా గుర్తింపు కోసం భారీ అంచనాలే పెట్టుకుంది. గత రెండు సంవత్సరాల క్రితం నుండి కార్మికుల సొంత ఇంటి కల కోసం 250 గజాల ఇళ్ల స్థలాన్ని ఇవ్వాలని పోరాటం చేసింది. ప్రస్తుత గుర్తింపు ఎన్నికల్లో అందరూ మేనిఫెస్టోలో కార్మికులకు 250 గజాల ఇళ్లస్థలం ఇస్తామంటూ చేర్చడంపై సీఐటీయూను కాపీ కొడుతున్నాయని, గతంలో గుర్తింపు సంఘాలుగా ఉన్న నాయకులు సొంతింటి కల కోసం పోరాటం ఎందుకు చేయలేదని కార్మికులు అనుకుంటున్నారు. మిగతా హెచ్ఎంఎస్, బిఎంఎస్, విప్లవ సంఘాలు సైతం గుర్తింపు కోసం బలంగానే ప్రయత్నాలు చేస్తున్నాయి. కార్మికులు ఏ సంఘాన్ని తమ ప్రాతినిధ్య సంఘంగా ఎన్నుకుంటారనేది ఈ రోజుతో తేలిపోనుంది.

ఏరియా	ఓటర్ల సంఖ్య	పోలింగ్ కేంద్రాలు
బెల్లంపల్లి	985	05
మందమర్రి	4876	11
శ్రీరాంపూర్	9124	15
కార్పొరేట్(కొత్తగూడెం)	1192	05
కొత్తగూడెం	2370	06
మణుగూరు	2414	07
ఇల్లందు	603	03
భూపాలపల్లి	5350	09
రామగుండం-1	5430	11
రామగుండం-2	3479	06
రామగుండం-3	3063	06

ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తాం : హరీష్‌బాబు



కాగజ్‌నగర్‌రూరల్: తనపై నమ్మకంతో గెలిపించిన బెంగాళీల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఎన్నికల విజయం అనంతరం తొలిసారిగా మంగళవారం నజ్రుల్‌నగర్ మార్కెట్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. మార్కెట్‌లో గల నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెంగాలీలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బెంగాలీ సోదరుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామని, చేదోడు వాదోడుగా ఉంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, అప్పర్ డ్యాం లోయర్ డ్యాం పునరుద్ధరణ, బెంగాలీ సోదరులకు ప్రత్యేక రైలుతో పాటు వివిధ హామీలను దశలవారీగా నెరవేరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కాళిదాస్ ముజుందార్, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్రచారి, మండల అధ్యక్షులు రణ్‌వీర్ బిశ్వాస్, ఎంపీటీసీ బీకాస్ ఘరామి, మండల ప్రధాన కార్యదర్శి గజ్జి ప్రసాద్, సర్పంచ్ ధోతుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బిజయ్ ఘరామి, అశోక్ ఆర్య గురూజీ, పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాపాలన ద్వారా ప్రభుత్వ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలి

నస్పూర్ : ప్రజాపాలన ద్వారా అర్హత గల ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి ఫలాలు అందవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) బి.రాహుల్, సబావత్ మోతిలాల్(రెవెన్యూ), డిసిపి సుధీర్ రామ్నాథ్ కేకన్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, బెల్లంపల్లి ఆర్డీఓ పి.హరికృష్ణ, జడ్పీ సీఈఓ నరేందర్, డీఆర్డీఓ బి.శేషాద్రి, డీపీఓ వెంకటేశ్వర్‌రావుతో కలిసి జిల్లా అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఈఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు పాలన చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రతి 4నెలలకు ఒకసారి 8 పని దినాల్లో, ప్రతి రోజు 2 షిఫ్టులలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ప్రతి గ్రామపంచాయతీ, పట్టణ ప్రాంతంలో ప్రతి మున్సిపల్ వార్డులో కార్యక్రమం ఉంటుందని, ఇందులో మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ, చేయూత పథకాలకు సంబంధిత దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో అవసరమైన బృందాలను ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి బృందం రోజుకు 2గ్రామాలలో సభలు నిర్వహించాలని పేర్కొన్నారు. జనవరి 6, 2024 నాటికి అన్ని గ్రామాలలో పూర్తి చేసుకోవాలని, పట్టణ ప్రాంతాలో వార్డుల స్థాయిలో అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి 100 కుటుంబాలకు కనీసం 1 కౌంటర్ ఉండేలా కార్యచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణలో స్త్రీ, పురుషులకు వేర్వేగా క్యూలైన్లు, మహిళల కొరకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని, భారీ సంఖ్యలో దరఖాస్తుదారులు ఉన్న సమయంలో టోకెన్ విధానాన్ని అనుసరించాలని తెలిపారు. రోజువారీ దరఖాస్తుల స్వీకరణ వివరాలను ప్రధాన కార్యదర్శి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి)కి నిర్ణీత నమూనాలో అందించడం జరుగుతుందని, స్వీకరించిన అన్ని దరఖాస్తులు టీమ్ లీడర్ ఆధీనంలో ఉంచాలని తెలిపారు. అన్నింటినీ సురక్షితంగా భద్రపరిచి కంప్యూటీకరణ చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్, తెల్లరేషన్ కార్డు జతపరచాలని, దరఖాస్తుదారునికి తప్పనిసరిగా రశీదు అందించడంతో పాటు రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 6 గ్యారంటీల పథకాలు అర్హులైన పేద ప్రజలకు అందించే విధంగా గ్రామసభలో అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో కృషి చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా లబ్దిదారులను ఎంపిక చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని, ఆక్రమిత ప్రభుత్వ భూములను గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన నిరుపేద లబ్దిదారులకు అందించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామసభలకు సంబంధిత గ్రామాల ప్రజాప్రతినిధులను ముందుగానే ఆహ్వానించాలని తెలిపారు. ప్రజాపాలన అమలుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు



మళ్లీ మనిషిలోకి పుస్తక పరిచయం

ఆదిలాబాద్‌టౌన్: మారిన కాలాగుణ పరిస్థితులు, విచ్ఛిన్న, వినాశకర పోకడలతో మనిషి తన సహజ తత్వాన్ని కోల్పోతున్నాడని ఆల్ ఇండియా రేడియో విశ్రాంత అధికారి సుమనస్పతిరెడ్డి అన్నారు. ప్రముఖ కవి, రచయిత డాక్టర్ ఉదారి నారాయణ రచించిన మళ్లీ మనిషిలోకి పుస్తక పరిచయ సభను మంగళవారం పట్టణంలో ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా రచయితను సత్కరించి అభినందించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సుమనస్పతిరెడ్డి మాట్లాడుతూ పూర్వీకులు అందించిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వ సంపద నేటి వికృత సంస్కృతితో తీవ్ర స్థాయిలో ప్రభావితమవుతోందని, చివరకు మనిషి తన సహజ తత్వాన్ని కోల్పోయే దౌర్భాగ్య పరిస్థితులు దాపురిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల్ని పెంచే విధానం, ప్రకృతి, పర్యావరణం, ఉమ్మడి కుటుంబజీవితాలు వీటితో ప్రభావితమవుతున్నాయన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మనిషి తాను మనిషినన్న విషయాన్ని కూడా మర్చిపోయే ప్రమాదముందన్నారు. మనిషిని తిరిగి మనిషిలోకి ఎలా తీసుకెళ్లాలనే అంశంపై మళ్లీ మనిషిలోకి పుస్తకం ద్వారా రచయిత ఉదారి నారాయణ అద్భుతంగా ఆవిష్కరించారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి గోపగాని రవీందర్, మాజీ జడ్పీటీసీ బొల్లారం బాబన్న, అధ్యాపకుడు నర్సింగ్, వయోవృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే, రిమ్స్ ఆర్ఎంఓ తొడసం చందు, రిజ్వాన్ పాల్గొన్నారు.



పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ పట్టణంలోని పద్మావతినగర్‌కు చెందిన ప్రశాంత్‌గౌడ్ మంగళవారం మధ్యాహ్నం మార్కెట్‌లో రూ.18వేల విలువగల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. కాగా ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్న తస్నీరు ప్రకాష్ అటుగా వెళ తుండగా మార్కెట్ సమీపంలో ఫోను దొరికింది. దీంతో వివరాలు తెలుసుకొని బాధితుడికి సమాచారం అందించారు. కాగా దొరికిన సెల్ ఫోన్‌ను బాధితునికి అందజేశారు.

డీసీసీబీ చైర్మెన్ పదవికి రాజీనామ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి బీఆర్‌ఎస్‌కి రాజీనామా చేసినట్టే తన డీసీసీబీ చైర్మెన్ పదవికి రాజీనామా చేయాలని ఎంపీపీ గంద్రత్ రమేష్ అన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నతో కలిసి ఉండి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేయడం సరైంది కాదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామ చేసిన ఆయన చైర్మెన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మెన్ పరమేశ్వర్, బీఆర్‌ఎస్ నాయకులు సేవ్వ జగదీష్ యాదవ్, కుమ్ర రాజు, గంగయ్య యాదవ్, సర్పంచ్ భూమన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.



పేదప్రజల సమస్యలపై అనునిత్యం పోరాటం : సీపీఐ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేదప్రజల సమస్యలపై అనునిత్యం సీపీఐ పోరాటం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం భుక్తాపూర్ కాలనీలోని సీపీఐ కార్యాలయంలో 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులతో కలిసి జెండాను ఆవిష్కరించి, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు తెలంగాణ సాయుధ పోరాటంలోనూ సీపీఐ కీలకంగా వ్యవహరించిందని అన్నారు. 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ కేంద్రంగా పార్టీ ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి నేటి వరకు పేదల పక్షాన నిలుస్తుందని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోనూ తన వంతు పాత్ర పోశించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలతో పేదల బ్రతుకులు దుర్భరమవుతున్నాయన్నారు. ఇందుకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అరుణ్ కుమార్, పాషా, అమీనా పాల్గొన్నారు.

తాంసి : పేదప్రజల సమస్యలను పరిష్కరించేందుకే సీపీఐ ఆవిర్భవించిందని సీపీఐ సీనియర్ నాయకులు చంద్రమౌళి అన్నారు. మంగళవారం సీపీఐ పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గోట్కూరి గ్రామంలోని పార్టీ కార్యాలయంలో ముగింపు సభా సందర్భంగా సీపీఐ జెండాను చంద్రమౌళి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సీపీఐ పేద ప్రజల పక్షాన నిలబడి ఎన్నో పోరాటాలు చేసిందని అన్నారు. నాటి నుంచి నేటి వరకు అమరవీరుల అరుణ రక్తపు సిరా సాక్షిగా ఎరుపెక్కిన ఎర్రజెండా 99 ఏండ్లుగా రెపరెపలాడుతూనే ఉందన్నారు. స్వతంత్ర ఉద్యమంలో ఎందరో విప్లవకారులు దేశభక్తులు కమ్యూనిజం స్థాపన లక్ష్యంగా కాన్పూర్‌లో సమావేశమై భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ సభను నిర్వహించారు. అదే సీపీఐ ఆవిర్భావ దినం ప్రజా సమస్యలపై కేంద్ర రాష్ట్ర పాలకులపై పోరాటాలను నిర్వహించి, ప్రజా సమస్యలను పరిష్కరించుకున్నామని అన్నారు. కర్రే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందని అన్నారు. నైజాం రాజరిక వ్యవస్థను నిర్మూలించడంతో పాటు రూ.10 లక్షలకు పైన భూమిని, భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేసిన ఘనత సీపీఐకి ఉంది నేడు ఆదిలాబాద్ జిల్లాలో పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కార్యాచరణ రూపొందించుకొని జిల్లా త్యాగమూర్తులు అమరవీరులు రామ్ కిషన్ శాస్త్రి, దాది శంకర్, కస్తాల రామకిష్టు, వన్నెల ఎల్లన్న లాంటి ఎందరో కమ్యూనిస్టు పార్టీ ఎర్రజెండా చేత పట్టుకొని ఉద్యమాలు చేయడం జరిగిందన్నారు. వారి అడుగుజాడల్లోనే మనమందరం ప్రజల బడుగు, బలహీన, కార్మిక, కర్షిక పక్షాన నిలబడి హక్కుల సాధన కోసం పోరాటాలు చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చిలక దేవిదాస్, ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా సీనియర్ నాయకులు కట్ట సునీత, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కట్ట కృష్ణ స్వామి, అర్ధాంగి రమేష్, కేశవ్, బత్తుల గంగారెడ్డి, భాస్కర్, మాచర్ల శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

బోథ్ : మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సమీపంలో సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు గోవర్ధన్, షేక్ షాకీర్ మాట్లాడుతూ నేటికీ సీపీఐ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం పోరాటం చేస్తుందని కొనియాడారు. నేడు పేదవాడికి కూడు, గూడు, రెండు పూటల తిండి కావాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల గిట్టుబాటు ధరలు పేదవాడికి విద్యా, వైద్యం ఉచితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నరేష్, నాయకులు ప్రేమ్‌సింగ్ రాథోడ్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



నడి రోడ్డుపై యువకుడి దారుణ హత్య



నవతెలంగాణ-ఇచ్చోడ

నడి రోడ్డుపై అందరూ చూస్తుండగానే యువకుడిని వెంబడించి గొడ్డలితో నరికి, కత్తులతో హత్య చేసిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం ఉదయం ఓ యువకుడిని ఇద్దరు వ్యక్తులు గొడ్డలితో, కత్తులతో సిరిచెల్మ చౌరస్తా మీదుగా ప్రభుత్వాస్పత్రి సమీపంలో వెంబడించి గొడ్డలితో నరికి, కత్తులతో దాడి చేసి హత్య చేశారు. హత్య గురైన యువకుడు వాములే ఈశ్వర్(32)గా గుర్తించారు. మృతుడు మండలంలోని గుండివాగు గ్రామానికి చెందిన వ్యక్తి, ఇచ్చోడ మండల కేంద్రంలోని టీచర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మృతిని బాబాయ్ పాండురంగ్, అతని కుమారుడు సూర్య కాంత్‌లు హత్య చేసి స్థానిక పోలీసులు స్టేషన్‌లో లొంగిపోయారు. భూముల పంపిణీలో భాగంగానే హత్య జరిగినట్టు తెలుస్తోంది. ప్రజల మధ్యలో దారుణ హత్య జరగడం ఈ ప్రాంతంలో మొదటి సంఘటన కావడం సంచలనం రికేత్తించింది. మృతిని భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నరేష్ తెలిపారు. మృతునికి భార్య నాలుగు సంవత్సరాల ఒక కూతురు ఉంది.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-నార్నూర్

తమ గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని గాదిగూడ మండలంలోని కునికాసా గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కునికాసా గ్రామస్తులు శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను వివరించారు. గ్రామంలో రోడ్డు, తాగునీటి వసతి, గంగా దేవుని దగ్గర రెండు రేకుల షెడ్లు నిర్మించాలని విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ వెడ్మ దేవ్‌రావ్, సర్పంచ్ జంగు, గజానంద్, జాకు, నగేష్, భీంరావ్ ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని రాజంపేట గ్రామంలో అఖండ హరినామ, శివలీల అమృత పారాయణం సప్తహా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారి మండలానికి రావడంతో కార్యకర్తలు, ఆదివాసులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని విడతల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రతి ఆదివాసీ గ్రామాలకు రోడ్డు సౌకర్యాన్ని కల్పిస్తానని హామీ ఇచ్చారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు. ఖానాపూర్ నియోజక అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమృత్‌రావ్, జెడ్పీటీసీ చంద్రకళ రఘురాం, రిమ్మ సర్పంచ్ అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇమామ్, మైనారిటీ మండల అధ్యక్షుడు రంజాన్, నాయకులు పాండు, రాజారాం, బిక్కు, బషీర్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో నాయకుల ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని లింగి గ్రామంలో శిరిడి సాయిబాబా జాతర సందర్భంగా మంగళవారం పలువురు రాజకీయ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. బీఎస్‌ఎన్‌ఎల్ మాజీ ఉద్యోగి సాయి వృద్ధాశ్రమ నిర్వాహకులు అశోక్, షిరిడి సాయిబాబా ఆలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. లింగి గ్రామంలో షిరిడిసాయిబాబా ఆలయానికి పునాది వేసిన మొట్టమొదటి వ్యక్తిగా దెబ్బడి అశోక్ అన్నారు. ఆలయ నిర్మాణానికి కృషి చేసిన వ్యక్తి తన పెన్షన్ నుంచి కూడా ఆలయ నిర్మాణానికి ఖర్చు చేసిన ఘనత దెబ్బడి అశోక్ దేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి, జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, సర్పంచ్ రేవతి పోచ్చన్న, సుంకిడి సర్పంచ్ గెల్ల మహేందర్ యాదవ్, తలమడుగు సర్పంచ్ కళ్లెం కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్ యాదవ్, విలాస్, బాబన్న, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తోట వెంకటేష్, కేదారీశ్వర్‌రెడ్డి, కాటిపెల్లి శ్రీనివాసరెడ్డి, ఝరి సొసైటీ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, అభిరాంరెడ్డి, మేకల రవికాంత్, తోట ప్రమోద్, పోచ్చన్న, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లోకేశ్వరం

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన లోకేశ్వరం మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుస్పూర్ గ్రామానికి చెందిన రామిల్లి సాయిలు(45) సంతానం లేకపోవడంతో మనస్తాపంతో గత కొన్ని నెలల నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతని భార్య రామిల్లి అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై సాయికుమార్ తెలిపారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-జైపూర్

ప్రజలు సాంఘీక దురాచారాలతో పాటు సైబర్ నేరాల పట్ల జాగ్రత్త వహించాలని భీమారం ఎస్సై రాజవర్ధన్ సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ రేమో రాజేశ్వరి ఆదేశాల మేరకు భీమారం మండల కేంద్రంలో మంగళవారం కళాజాత బృందంచే ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత విద్య, ఆత్మహత్య, సాంఘీక దురాచారాలు, గంజాయి, వాహన ప్రమాదాలు, సైబర్ క్రైమ్‌ల పట్ల కళాజాత బృందం ఆటపాటలతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గద్దె రాంరెడ్డి, కానిస్టేబుల్ మాచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా దత్తాత్రేయ జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గురు స్వరూపుడైన దత్తాత్రేయ స్వామి జన్మదిన వేడుకలను భక్తులు మంగళవారం భక్తి ప్రపత్తుల నడుమ కన్నుల పండువగా నిర్వహించుకున్నారు. స్థానిక దస్నాపూర్, హనుమాన్‌నగర్‌లోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో జయంతోత్సవం వైభవంగా సాగింది. పట్టణంలోని గోపాల కృష్ణ మఠం పీఠాధిపతి విశిష్ట అతిథిగా హాజరుకాగా ఉదయం ఆలయ అర్చకుడు బాలాజీ మహరాజ్ అభిషేకాది ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయ యజ్ఞాన్ని వేదోక్త మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. స్వామి వారికి ఊయల సేవలు నిర్వహించిన అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన పల్లకీలో ఊరేగించారు. భక్తుల దత్త నామస్మరణలు. భజన బృందాల కీర్తనల నడుమ పల్లకీ శోభాయాత్ర వీధుల గుండా నేత్ర పర్వంగా సాగింది. పట్టణంతో పాటు పరిసర కాలనీలు, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం చేపట్టింది.

లక్ష్మణచాంద : మండలంలోని మునిపెల్లి గ్రామంలో శ్రీసాయినాథ ఆలయంలో దత్తా జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయినాథ, దత్తాత్రేయ, శివలింగ విగ్రహాలకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిత్రపటాలను ఊరేగించి, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాంపెల్లి రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదు : ఎంపీడీఓ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన నరేష్‌గౌడ్ కుటుంబాన్ని గ్రామ వీడీసీ సభ్యులు సంఘ బహిష్కరణ చేసిన సంగతి తెలిసిందే, ఈ సంఘటనపై నవతెలంగాణ పత్రికలో కుల బహిష్కరణ చేస్తే పట్టించుకోరా..? అనే శీర్షికతో వార్త ప్రచురితం అయ్యింది. కుల బహిష్కరణతో తమ కుటుంబాలు తీవ్ర మనోవేదనకు గురయ్యాయని చివరిసారిగా అధికారులను ఆశ్రయించామని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పూర్తిస్థాయిలో తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు వాపోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు వీడీసీ సభ్యులు నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై సాయి కుమార్ పేర్కొన్నారు. ఈ విషయమై ఎంపీడీఓ సాల్మాన్ రాజ్ మాట్లాడుతూ బాధితులు తెలిపిన వివరాల ప్రకారం నేటి సమాజంలో ఇలాంటి అసాంఘిక, పౌర హక్కులను ఉల్లంఘించే కార్యకలాపాలకు ఎవరైనా, ఎక్కడైనా పాలుబడితే వెంటనే కుటుంబ సభ్యులు అయిన ఇరుగు పొరుగువారు అయిన సంభందిత అధికారులకు ఫిర్యాదు చేయాలని, వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో వీర్‌బాల్ దివస్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వీర్‌బాల్ దివస్‌ని పురస్కరించుకొని దేశం కోసం, ధర్మం కోసం, తమ ప్రాణాలు బలిదానం చేసిన సాహెబ్ జాదే బాబా జొరావర్ సింగ్, బాబా ఫతే సింగ్‌లకు ఆదిలాబాద్ బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఇందులో భాగంగా మంగళవారం పట్టణంలోని సిక్కు సమాజానికి చెందిన కుటుంబాలను పరామర్శించి, వారిని శాలువాతో సత్కరించారు. అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ ఆదినాథ్, విజయ్, జోగు రవి నాయకులు ఉన్నారు.

'మున్సిపల్ చైర్మెన్‌పై అవిశ్వాసం సరికాదు'



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టడం సరైంది కాదని శాంతినగర్ కాలనీకి చెందిన పలువురు నాయకులు అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలో అందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి కానీ ఈ విధంగా అవిశ్వాసాలు పెట్టడంతో ఖానాపూర్ అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. నిజంగా మున్సిపాలిటీలో అవినీతి జరుగుతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చైర్మెన్‌ని పదవి నుంచి తప్పించాలని అన్నారు. కానీ ఇలాంటి చర్యలకు పాల్పడి అభివృద్ధిని అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగం కాదన్నారు. ఇప్పటికే మున్సిపల్ ఏర్పడటంతో పేద ప్రజలు ఉపాధి హామీ పథకానికి దూరమై ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అటువంటి సమస్యలపై పాలకవర్గం దృష్టి సారించాలని కోరారు. ఇప్పటికైనా మున్సిపల్ కౌన్సిలర్లు అందరూ ఏకతాటిపైకి వచ్చి అవిశ్వాస తీర్మానంపై పునరాలోచించాలని కోరారు. ఈ సమావేశంలో నవ అంకార్ శ్రీనివాస్ గంగ నర్సయ్య, లాండేరి రమేష్, అంకం నాగరాజు, సాడిగే రమణ, నర్సయ్య కోమటిపల్లి శేఖర్, దాదే శ్రీకాంత్, సిరిగారపు రాజు, మహేష్, పింటూ, రాజేందర్ ఉన్నారు.

ప్రజా పాలనను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ బాలే మల్లేశం అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు ఆయా గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన కార్యక్రమం ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏఓ ఆసం రవి, ఖానాపూర్ ఎస్సై లింబాద్రి, ఎంపీఓ చంద్రశేఖర్, ఐసీడీఎస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముధోల్ : ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ సురేష్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 28 నుంచి జనవరి 3వ తేదీ వరకు గ్రామాల వారిగా గ్రామ సభలు నిర్వహించాలని అన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కింద ప్రజల నుంచి దరఖాస్తు లను స్వీకరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : ప్రజా పాలన కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీఓ శేఖర్ అధికారులకు సూచించారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీఓ నసీరుద్దీన్, వైద్యాధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దుకు సహకరించాలి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల సరిహద్దు పంటపొలాల్లో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దుకు సహకరించాలని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి మంగళవారం మండల కేంద్రంలోని నాయకులు, వీడీసీ సభ్యులు, ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి తరుపున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడంతో వాయు, జల కాలుష్యాలు ఏర్పడుతాయని అన్నారు. వన్య ప్రాణుల జీవనానికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. గోదావరి జలాలు కలుషితమై తాగునీటి అపరిశుభ్రత, గోదావరి నదిలో చేపలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అన్నారు. పరిసర గ్రామ ప్రజలతో ఎలాంటి అభిప్రాయ సేకరణ చేయకుండా ఫ్యాక్టరీ ప్రారంభించడం సరికాదని అన్నారు. రోజురోజుకు ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు శరవేగంగా జరుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఫ్యాక్టరీ పనులు తాత్కాలికంగా నిలిపివేయాలని జిల్లా కలెక్టర్‌కు చరవాణి ద్వారా ఆదేశించారు. మండలంలోని రైతులు, నాయకులు ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేయాలని అన్నారు. ఫ్యాక్టరీ తరలించేందుకు నావంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఎలాంటి ఆందోళనా కార్యక్రమాలు చేపట్టినా మీతో కలిసి పోరాటం చేయడానికి సిద్ధమని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

కుమురంభీం
ఆసిఫాబాద్-మంచిర్యాల

బుధవారం | డిసెంబర్ 27, 2023 | www.navatelangana.com

ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం విజయవంతం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలోని బాలభారతి ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం విజయవంతంగా ముగిసింది. సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ప్రారంభించారు. ఆసిఫాబాద్, మంచిర్యాల నుండి వచ్చిన రక్త పరీక్షల బృందం మొత్తం 650 మందికి 130 రకాల రక్త పరీక్షలు నిర్వహించారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన ఈ శిబిరం సాయంత్రం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో బాలభారతి పాఠశాల ఛైర్మన్ ఖాజా వసీమొద్దీన్‌తో పాటు సీఎస్‌సీ హెల్త్ కేర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నవతెలంగాణ-జన్నారం



క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎస్సిటీ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత అన్నారు. మండల కేంద్రంలో యువతకు నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం ఆయన బహుమతులను అందజేశారు. క్రీడలతో ప్రతి ఒక్కరిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు. యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకొని రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్ బాధంపల్లి హెడ్ మాస్టర్ జాడి ప్రభాకర్, బోర్లకుంట ప్రభుదాస్, ఉపాధ్యాయులు సాగర్, రమేష్, కాంతయ్య, సుభాష్ హెడ్ కానిస్టేబుల్ భోజన్న, హెల్త్ డిపార్ట్మెంట్ అలాగే క్రీడాకారులు రూబేన్ శ్రీకాంత్, బోయాజ్ కమలాకర్, ఆదర్శ కుమార్ పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడ్డ యువకుడి అరెస్ట్



నవతెలంగాణ-మందమర్రి

గంజాయితో పట్టుబడ్డ యువకున్ని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పాత బస్టాండ్ హెచ్‌పీ పెట్రోల్ బంకు ప్రాంతంలో ఐడి డిపార్మెంట్‌కు చెందిన అజయ్, సంపత్ లకు అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి కనిపించడంతో అతన్ని తనిఖీ చేయగా 200గ్రా గంజాయి లభ్యమయింది. విచారించగా విద్యానగర్‌కు చెందిన ఆవుల లాడెన్ కొంత కాలంగా చంద్రపూర్ నుంచి గంజాయి తీసుకువచ్చి పట్టణంలో విక్రయించడమే కాకుండా తాను కూడా సేవిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. పంచనామా నిర్వహించిన అనంతరం అతన్ని స్టేషన్‌కు తరలించి ఎస్సై చంద్రకుమార్ కేసు నమోదు చేసారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఎవరైనా గంజాయి సేవించినా సరఫరా చేసినా పీడీ యాక్టు నమోదు చేస్తామని, గంజాయి రవాణా కాని సేవించే వారి వివరాలు పోలీసులకు తెలుపాలని తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని తెలిపారు.

ఐఎన్‌టీయూసీని అధిక మెజార్టీతో గెలిపించాలి

- పవర్‌ప్లాంట్ కార్మికులతో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ కార్మికులను కలిసిన ఆయన ఐఎన్‌టీయూసీ కార్మికుల కోసం పని చేస్తోందని, ఇతర సంఘాల మాదిరిగా సింగరేణి సంస్థలో కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ అనవసర జోక్యం ఉండదని పేర్కొన్నారు. గత రెండు రోజులుగా శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల్లో గల భూగర్భ గనులు, ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఐఎన్‌టీయూసీ గెలుపు కోసం ప్రచారం చేసిన ఆయన తాజాగా సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ కార్మికులను కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఐఎన్‌టీయూసీ నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మహమ్మద్ ఫయాజ్, విశ్వంబర్‌రెడ్డి, బేతు తిరుపతిరెడ్డి, గుడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, బేర మల్లేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు గడ్డం రాకేష్ పాల్గొన్నారు.

వెంటనే రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెం నుంచి కాసిపేట గని వరకు రోడ్డుపై తీవ్ర గుంతలతో ఇబ్బందులు పడుతున్నామని వెంటనే సమస్య పరిష్కరించాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకుడు గోనెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో మట్టితో గుంతలు పూడ్చి నిరసన తెలిపారు. రోడ్డుపై ఓరియంట్ కంపని, సింగరేణి భారి వాహనాలు తిరుగుతుండటంతో పాటు కార్మికులు వెళ్ళ గుంతల్లో పడుతు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. వెంటనే ప్రజాప్రతినిధులు స్పందించి సింగరేణి, ఓరియంట్ యాజమాన్యాల ద్వారా కాని ప్రభుత్వం ద్వారానైన రోడ్డు పునర్నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకుడు దాసరి రాంచందర్, కాంగ్రెస్ నాయకుడు దుర్గం గోపాల్, కారుకూరి లక్ష్మణ్, బొడ్డు శంకర్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న తెలుగు సబ్జెక్టు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు అర్హుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి లక్ష్మీనరసింహం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలనీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉన్న వారు అర్హులని, పీహెచ్‌డి, నెట్, సెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 29లోగా దరఖాస్తులు సమర్పించాలని, పూర్తి వివరాలకు 7013607011 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రామ మందిర ఆహ్వాన పత్రం విడుదల

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అయోధ్య శ్రీ రామ మందిర చిత్రపటంతో పాటు ఆహ్వానపత్రాలను మంగళవారం విడుదల చేశారు. శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర అక్షంతల వితరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ భానుచందర్ మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతీ ఇంటికి అయోధ్య నుంచి వచ్చిన అక్షంతలు, భవ్య మందిరం ఫోటో, కరపత్రాలను పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. జనవరి 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన రోజు ప్రతీ మందిరంలో భజన కార్యక్రమాలు, ప్రతిష్ఠాపన వీక్షణ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతీ ఇంటి ముందు ఐదు దీపాలు వెలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



వేరుశనగ పంట సాగుకు ఇదే అదును

- ఉమ్మడి మండలంలో 1400 ఎకరాల్లో వరి సాగు
- 500 ఎకరాల్లో వేరుశనగ, మిర్చి పంటలు



నవతెలంగాణ-జైపూర్

రబీ పంటల సాగులో వరి పంటలతో పాటు వేరుశనగ, మిర్చి పంటలు సాగు చేస్తున్న రైతులు ఆలస్యంగా సాగు చేసినా వేరుశనగ పంటల సాగుకు ఇది సరైన సమయమే అంటున్నారు. ఒక వైపు నెల రోజుల వ్యవధితో వేరుశనగ పైరు పెరుగుతుంటే మరో వైపు ఆలస్యమైన పంట పొలాల్లో వేరుశనగ విత్తనం పెడుతున్నారు. పౌనూర్ శివారులో మధ్యంతరంగా బంతి పువ్వుల పంట సాగు చేసిన రైతులు బంతి పంటను తొలగించి వేరుశనగ పంటను సాగు చేస్తున్నారు. ఉమ్మడి మండలంలో యాసంగి పంటల సాగులో నిమగ్నమైన రైతులు ప్రధాన పంటగా వరి పంటలను సాగు చేస్తున్నారు. జైపూర్ మండల పరిధిలో సుమారుగా 9 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతున్నట్లు వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ పేర్కొన్నారు. అదేవిధంగా గోదావరి తీర ప్రాంతంలో రైతులు ఆనవాయితిగా సుమారు 200 ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తుండగా 300 ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నీటి వసతి ఆదారంగా వేరుశనగ, మిర్చి పంటలు సాగు చేస్తుండగా ఆలస్యమైనా నీటి యాజమాన్యం, చీడపీడల నివారణ చర్యలు చేపడితే ఆశించిన మేరకు దిగుబడి సాధించవచ్చునని తెలిపారు.



భీమారం మండలంలో..

భీమారం మండల పరిధి రైతులు యాసంగి సీజన్‌లో ప్రదాన పంటగా వరి పంటను సాగు చేస్తున్నారు. ప్రధానంగా బోరు బావుల ఆధారంగా వరి పంటను సాగు చేస్తుండగా మండల పరిధిలో 5 నుండి 6 వేల ఎకరాల్లో వరి పంట సాగవతోంది పంటల సాగులో పెట్టుబడులు తగ్గించుకోవడం కోసం రైతులు నేరుగా విత్తనం చల్లుకునే పద్ధతిని అవలంభిస్తున్నారు. నారు మడి తయారు చేయడం వరి నాటు వేయడం ద్వార పెట్టుబడులు పెరుగుతున్నందున నేరుగా మొలక వడ్లను పొలంలో చల్లుకోవడం ద్వార నాటు ఖర్చులు తగ్గించుకోవడం జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. నేరుగా మొలక చల్లుకున్నా నాటు వేసినా దిగుబడిలో పెద్ద మార్పు ఉండటం లేదని రైతులు పేర్కొంటున్నారు.

ప్రశ్నించే వ్యవస్థ పోయి పైరవీ వ్యవస్థ వస్తుంది

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపిస్తే ప్రశ్నించే వ్యవస్థ పోయి పైరవీ వ్యవస్థ వస్తుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. మంగళవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీలను కార్మికులు ఓడించాలని, కార్మికుల కోసం నిరంతరం పోరాడే సీఐటీయూసీని గెలిపించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఐఎన్టీయూసీలో ప్రస్తుతం గత టీబీజీకేఎస్ నాయకులే కండువాలు మార్చి వస్తున్నారని, ఏఐటీయూసీ నాయకుల వల్ల డిపెండెంట్ ఉద్యోగాలు పోయాయని పేర్కొన్నారు. ఎర్ర జెండా ముసుగులో ఏఐటీయూసీ నాయకులు పైరవిలకే పరిమితమయ్యారని, కార్మికుల హక్కులను కాల రాశారని విమర్శించారు. ఒక్కసారి సీఐటీయూకు అవకాశం ఇస్తే కార్మికుల పట్ల నీతి, నిజాయితీగా పని చేస్తూ కార్మికుల హక్కులు సాధిస్తామన్నారు. కార్మికులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందిస్తూ, వారి పిల్లలకు సీబీఎస్ఈ విద్యా విధానాన్ని తీసుకొస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష కార్యదర్శులు గుల్ల బాలాజీ, గోదారి భాగ్యరాజు, బ్రాంచ్ ఆర్గనైజర్ వెంగళ శ్రీనివాస్, ట్రెజరర్ కస్తూరి చంద్రశేఖర్, ఆర్కే-6 ఫీట్ కార్యదర్శి సాయిల్ల శ్రీనివాస్, ఐకే 1ఏ ఫిట్ కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, ఎస్ఆర్పీ ఓసి ఫిట్ కార్యదర్శి సిపతి బానేష్, ఎస్ఆర్‌పి 1ఫిట్ కార్యదర్శి తోడే సుధాకర్, నాయకులు పెరుక సదానందం, ఇతినేని వెంకటేష్, సంఘం రాజయ్య, రాజగోపాల్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ రెండూ ఒకటే



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ కలిసి పోటీ చేస్తున్నాయని, అవి రెండూ ఒక్కటేనని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంగళవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఓడిపోతానని భయంతో ఏఐటీయూసీ టీబీజీకేఎస్‌తో కలిసి పోటీకి సిద్ధపడ్డాయని, ఏఐటీయూసీకి ఓటు వేస్తే టీబీజీకేఎస్‌కు వేసినట్టేనని అన్నారు. మరల సింగరేణిని దోచుకునే విధానమే కొనసాగుతుందని పేర్కొన్నారు. సింగరేణిని కాపాడే శక్తిసామర్థ్యాలు కాంగ్రెస్‌కు ఉన్నాయని, దాని అనుబంధ సంఘమైన ఐఎన్టీయూసీ గడియారం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా పూర్తి బాధ్యత వహిస్తానని తెలిపారు. ప్రతి 2,4 ఆదివారాలలో కార్మికుల సమస్యల పరిష్కారానికి తప్ప వేరే వారికి సమయాన్ని కేటాయించనని తెలిపారు. కార్మికుల సమస్యలను భుజాన వేసుకొని పనిచేస్తానని, అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించినట్లే, ఐఎన్టీయూసీని గెలిపించి కార్మికుల రుణం తీర్చుకునే అధికారం ఇవ్వాలని కోరారు. ఐఎన్టీయూసీ ఇచ్చిన గ్యారెంటీలలో అన్ని అమలుకు కృషి చేస్తానని, రిటైర్డ్ కార్మికుల సమస్యలు కూడా పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు, కేంద్ర ఉపాధ్యక్షులు కళవేణ శ్యామ్, భీం రవి, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, తూముల నరేష్, తిరుపతి రాజు, నర్సింగ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగల అరెస్టు



నవతెలంగాణ-రెబ్బెన

కుమురంభీం జిల్లా పరిధిలో గత కొద్ది రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను రెబ్బెన, తిర్యాణి పోలీసులు ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారని ఆసిఫాబాద్ ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా రెబ్బెన, తిర్యాణి పోలీసులను అభినందించారు. అనంతరం నింధితుల వివరాలను వెల్లడించారు. కడారి శ్రీధర్(ఆసిఫాబాద్), దివితి పోచయ్య(ఆసిఫాబాద్), బాణాల శ్రీధర్(ఆసిఫాబాద్), ఆత్రం తిరుపతి(ఎడవెల్లి) రెబ్బెన మండలం, షేక్ రహీం(ఆసిఫాబాద్), బాణాల నగేష్(ఆసిఫాబాద్), కమ్మరి నరేష్(రెబ్బెన), కమ్మరి విజయ్(రెబ్బెన), షేక్ యాకూబ్(కాగజ్‌నగర్), కడారి శ్రీను(ఆసిఫాబాద్) మొత్తం 10 మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. వీరందరు కలిసి దొంగిలించిన ట్రాన్స్‌ఫార్మర్‌ల వివరాలు వెల్లడిస్తూ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆసిఫాబాద్ సీఎస్ 06, రెబ్బెన సీఎస్ 04, తిర్యాణి సీఎస్ 01, ఈస్‌గాం సీఎస్ 2, కాగజ్‌నగర్ సీఎస్ 01, సిర్పూర్ టౌన్ సీఎస్ 2, చింతలమానెపెల్లి సీఎస్ 01, స్వాధీనం చేసుకున్న వాటి వివరాలు 163 కేజీల కాపర్‌వైర్, ట్రాలీ ఆటో ఒకటి, బైక్ 01, మొబైల్ ఫోన్స్ 7, ఇనిస్ట్రమెంట్ దొంగలించారన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ, రెబ్బెన సీఐ అల్లం నరేందర్, ఎస్సై చంద్రశేఖర్, తిర్యాణి ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ఏర్పాట్లను మంగళవారం ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ పరిశీలించారు. గోలేటిలో సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసి కౌటింగ్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. కౌంటింగ్ ఏర్పాట్లకు సంబంధించి భద్రత ఏర్పాట్లను స్థానిక సీఐ, ఎస్సై, సింగరేణి అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా డీఎస్పీ సింగరేణి ఉద్యోగులకు, యూనియన్ నాయకులకు పలు సూచనలు చేశారు. సింగరేణి ఎన్నికల నిర్వహణ, అధికారుల నుంచి పాస్‌లు తీసుకున్న కౌంటింగ్ ఏజెంట్లు యూనియన్ నాయకులకు మాత్రమే కౌంటింగ్ సెంటర్‌లోకి అనుమతించబడుతుందన్నారు. అదేవిధంగా సింగరేణి ఎన్నికల అధికారుల నుంచి పాస్‌లు పొందిన మీడియా మిత్రులను మాత్రమే కౌంటింగ్ సెంటర్ ముందు ఏర్పాటుచేసిన మీడియా పాయింట్‌కు అనుమతి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ హాలులోకి సెల్‌ఫోన్‌ను తీసుకురాకూడదని, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి పొందిన ఎన్నికల అధికారులకు మాత్రమే సెల్‌ఫోన్ అనుమతించబడుతుందని తెలిపారు. ఎన్నికల ఏజెంట్లు, పోలింగ్ ఏజెంట్లు ఓటు వేయడానికి బూత్‌లోకి వచ్చే సింగరేణి ఓటర్లు సెల్‌ఫోన్, ఇంకుప్యాడ్లు, వాటర్‌బాటిళ్ల తీసుకురాకూడదని ఆయన తెలిపారు. కౌంటింగ్ సెంటర్‌కు వచ్చే యూనియన్ నాయకులందరు 200 మీటర్ల అవతల ఏర్పాటుచేసిన భారీ కేడ్ వెలుపల ఉండాలని ఆయన తెలిపారు.

ఇందన్‌పల్లి దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ఇందన్‌పల్లి హనుమాన్ దేవాలయంలో మంగళవారం ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను తప్పక అమలు చేస్తుందని అన్నారు. పాలకుడిగా రాలేదని సేవకుడిగా మీ ముందుకు వచ్చాను అని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఖానాపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకపడిందని అన్నారు. మీ అందరి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలం అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, సయ్యద్ ఇసాక్, ఏనుగు సుభాష్ రెడ్డి, మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య, ఫసి ఉల్లా, బాదావత్ సుధాకర్ నాయక్, దాముక కరుణాకర్, అజ్మీర నందు నాయక్, అల్లం వెంకట్రాజం, అబ్దుల్ ముజ్జు పాల్గొన్నారు.

ఈ-చలాన్‌ల రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని వాహనదారులు పెండింగ్ జరిమానాలపై ప్రభుత్వం కల్పించిన రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ద్విచక్ర వాహనాల చలాన్‌లపై 80 శాతం, నాలుగు చక్రాల వాహనాలు, ఆటోలపై 60 శాతం, లారీ వాహనాలపై 50 శాతం, ఆర్‌టీసీ బస్సులపై 90 శాతం ప్రభుత్వం రాయితీని ప్రకటించిందన్నారు. ఈ రాయితీ జనవరి 10వ తేదీ వరకు చెల్లింపుకు అవకాశముందన్నారు. వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ముగిసిన శివాలయ వార్షిక మహోత్సవం

నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని సదాశివ్‌పేట్ శివాలయంలో 50వ వార్షికోత్సవాలు గత మూడు రోజుల నుంచి ఆలయ అర్చకులు అంబేద శంకరయ్య, అంబేద సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించి మంగళవారం నాటికి వార్షిక మహోత్సవం ముగిసినట్టు వారు తెలిపారు. మంగళవారం పంచకలశ ఆరాధన, అంకురార్పణ, రుద్రాభిషేకం, ధ్వజారోహణ, మహా కుంభాబిషేకం, గణపతి హోమం, అగ్ని ప్రతిష్ఠ, వీరభద్ర కాళీ పూజలు, లక్ష దీపోత్సవ కార్యక్రమం, మహారుద్ర హోమం, అగ్నిగుండం భూమిపూజ, అగ్నిగుండ ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహించినట్టు వారు తెలిపారు. ఉదయం ఐదు గంటలకు అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం శివుడి ఆరాధన, గురుపూజ, హోమాల పూర్ణాహుతి, ఆశీర్వచనం నిర్వహించినట్టు తెలిపారు. మూడు రోజుల పాటు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికి అన్నదానం నిర్వహించారు.

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ ఛైర్మన్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబును మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్ కలిశారు. ఎమ్మెల్యేగా హరీష్‌బాబు గెలిచిన అనంతరం ఛైర్మన్ మొదటిసారిగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపినట్లు ఈ సందర్భంగా ఛైర్మన్ పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది కూడా ఎమ్మెల్యేను కలిసి శుభకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీధర్‌సుమన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వార్షిక పరీక్ష ఫీజు గడువులోగా చెల్లించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ ద్వారా డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వార్షిక పరీక్ష ఫీజు గడువు తేదీలోగా చెల్లించాలని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2017, 2018, 2019, 2020, 2021 మరియు 2022లో అడ్మిషన్ తీసుకొని ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం సెమిస్టర్-3, తృతీయ సంవత్సరం సెమిస్టర్-5 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అపరాధ రుసుము లేకుండా జనవరి 17 వరకు, రూ. 500 అపరాధ రుసుముతో జనవరి 23 వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులో విద్యార్థులు తాము రాయబోయే సబ్జక్టు కోడ్ తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఇతర వివరాలకు 9866398678, 7382929651లో సంప్రదించాలని సూచించారు.